


# కొరిమెట్టు

తన దురదృష్టానికి తనని నిందించుకుంటూ అత్తారింట అడుగుపెట్టింది ప్రతిమ. దరిద్రమే కాదు, అందమూ ఆడదాని పాలిట శత్రువుగా మారుతుందనేది ఆమె అనుభవంలోకి వచ్చింది. మరో జన్మంటూ వుంటే మధ్యతరగతిలో పుట్ట కూడదని, పుట్టినా అందంగా ఉండకూడదనీ దేవుడ్ని కోరుకుంది.

కంప్యూటర్ ఇంజినీరైన తను, ఓ రైతును, పల్లెటూరి బైతును పెళ్ళిచేసుకోవ డాన్ని ఎంతమాత్రమూ జీర్ణించుకోలేకపోతోంది ఆమె మనసు. పట్నవాసానికి అల వాటు పడిన ఆమెకు పల్లెటూరి బతుకు తలచుకుంటేనే జీవితం పట్ల విరక్తి కలగసాగింది. ఎంచక్కా తనలాగే కంప్యూటర్ ఇంజినీరైన ఓ అందగాడ్ని పెళ్ళాడి

వీలయితే విదేశాల్లో కొన్నిరోజులైనా గడపాలని కలలుగంది. చివరికి...తన బతుకు....కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి గిర్రున.

ఇంట్లో పెద్దకూతురైన నేరానికి, ఈ పెళ్ళి అనే శిక్షకు సిద్ధమైంది. ఆడపిల్ల జీవితకాలమంతా అపురూపంగా దాచుకోవలసిన పెళ్ళిలోని మధురక్షణాలు సైతం అనుభూతిరహితంగా జరిగిపోయాయి. అందంపట్ల తనకున్న శ్రద్ధ, ఆరాధన...ఇలా వ్యర్థమైపోతాయని...

"ఏంటాలోచిస్తున్నావు కలకంఠీ?"

ఉలిక్కిపడింది ప్రతిమ. పిల్లిలా ఎప్పుడొచ్చాడో పెళ్ళికొడుకు. ఆలోచన్లో నుండి తేరుకుని చూసింది. తనున్నది శోభనంగదిలోనన్న స్పృహకల్గగానే ఏదో చేదుమాత్ర మింగాల్సి వస్తున్నట్టనిపించింది. దానికితోడు ఓ వంకర డైలాగుల సినీ హీరోననుకరిస్తూ అతను.

'షిట్!' మనసులోనే కసిగా అనుకుంది.

ఆమె చేతిలోనున్న పాలగ్లాసును అందుకునే వంకతో రెండు చేతులనూ తడిమాడు ప్రతీక్.

ఏదో అలర్జీగా అనిపించింది ప్రతిమకి. పంటి బిగువున బాధనణచుకొని, మొహం తిప్పుకుంది.

"ప్రణయకళా రాణీ! నా రాణీ! ఎందుకింక ఆ సిగ్గులవోణీ!" గ్లాసులోని పాలు తాగకుండానే టీపాయ్ మీద పెట్టేసి, వెనుదిరిగి ఉన్న ఆమె భుజాలపై చేతులేశాడు. వెనుకనుండి హత్తుకోవాలని భుజాలపైని చేతులు తీసి నడుంపైకి పోనిద్దామని అనుకోగానే-

ఆమె చటుక్కునతప్పుకొని మంచంమీద కూర్చుంది. రెండుచేతుల్నీ వెనక్కి వాల్చి, వాటిమీద మేనువాల్చి, గట్టిగా కళ్ళుమూసుకుంది. 'దేవుడా! ఎలాగూ ఈ శిక్ష తప్పదు. ఓ నిద్రమాత్రమింగేసి, శరీరాన్ని అతనికప్పగించేస్తే పోయేది. మరోక్షణంలో అతను తనమీద పడ్తాడు. ఆపై' అనుకుంటూ సెకన్ల ముల్లు గుండెలో చేసే శబ్దాన్ని లెక్క పెట్టుకుంటోంది.

ఆమె ఊహించినట్టు అతను ఆమె మీద వాలలేదు. అల్లుకోలేదు. వెక్కిరిస్తున్న క్షణాల నుండి తప్పుకుంటూ అతన్ని చూసేందుకు కళ్లుతెరిచింది. ఎదురుగా లేడు. అటూ-ఇటూ చూసింది. సడెన్‌గా అప్పుడామెకో అనుభూతి కలిగింది. అతని వెచ్చని ఊపిరి అనాచ్ఛాదితమైన ఆమె నాభితో ముచ్చటిస్తోంది.

అది ఆమెకు గిలిగింతనీయకపోగా, చిరాకు తెప్పించింది. వెంటనే పైటను ఆ భాగం కవర్‌చేసేలా లాక్కుంది. అలంకరించేప్పుడు ఆ చీరకట్టిన చిత్రాంగి వద్దంటున్నా పొత్తికడుపు కనిపించేలా కట్టడం తలచుకోగానే కోపమొచ్చింది ప్రతిమకి. 'అసలీ చీరసింగారింపులెందుకో?' అనుకుంటూంటే ఆమె పెదాలు వణికాయి.

"అధరము సుధలందించగ అల్లన వణికెనదో!" కొంటెగా చూస్తూ, కమ్మగా పాడాడు ప్రతీక్.

ఆ పాట మాధుర్యం ఆమెనాకట్టుకోలేకపోయింది. కాని, అతని ప్రయత్నానికి అనుకోని విఘాతమేర్పడింది. పెదవుల అందాన్ని తనివితీరా చూడకుండా చిన్ని కొండల్లాంటి ఆమె ఎదసంపద అడ్డుకోసాగింది.

నాభిని కప్పుకునేందుకు ఆమె చేసిన ప్రయత్నం వల్ల కొంగు సగం జారిపోయింది. ప్రతీక్ చూపులకు భయపడి పూర్తిగా జారిపోయింది. అద్భుతమైన ఆ సౌందర్యాన్ని చూస్తూ అట్టే ఆగలేకపోయాడతడు. ఒక్క ఉదుటున లేచి గట్టిగా తనకేసి హత్తుకున్నాడు. ఆ చర్యకి ఆమె పట్టుకోల్పోయి మంచంమీద పడిపోయింది.

స్మర కదనాన్ని అత్యున్నతంగా ప్రారంభించాలని ప్రతీక్ ఆమెనలాగే ఒడిసిపట్టుకొని తన పెదాలను నుదుటిపై అద్దాడు. ఆపై కనురెప్పల నద్దుతూ... కంగారుపడ్డాడు. ఆమె కనుగుడ్లనిండా అలుముకున్న నీరు పెదాల స్పర్శ తో గట్టు వదిలిన నదిలా దూకాయి.

వెచ్చని కన్నీరు, వణుకుతున్న పెదవులు, అదుర్తున్న ముక్కుపుటాలు. అవి ప్రణయసంకేతాలేమాత్రమూ కావని ఋజువు చేస్తున్న ఆమె సన్నని రోదన!

అర్ధరాత్రి దాటింది. ప్రతీక్‌కి నిద్రపట్టలేదు. ఎడతెగని అతని ఆలోచనలు ఆ గదిలోనిండిన సిగరెట్ పొగలా అతని గుండెనిండా ఆవరించాయి.

పొరబాటెక్కడ జరిగిందో కనుక్కోలేకపోతున్నాడు ప్రతీక్. తనకు ప్రతిమ పట్ల ఉన్న ఆసక్తి ఆమెకు తనపట్ల లేదని మొదటినుండీ కొంత అర్థమవుతున్నా అది ఇంత తీవ్రస్థాయిలో ఉందని గుర్తించలేకపోయాడు. అయితే ఆమె ఈ పెళ్ళికెందుకు ఒప్పుకుంది?? ఆర్థిక పరిస్థితులే కారణం గావచ్చు. అంటే ఈదేశంలో చాలామంది ఆడపిల్లలు ఇలాగే బలయిపోతూ ఉన్నారా? ఒకప్పుడు వాళ్ళ స్వేచ్ఛని సంప్రదాయం అడ్డుకునేది. ఇప్పుడు వాళ్ళ ఆలోచనలను ఆర్థిక పరిస్థితులు శాసిస్తున్నాయి.

'చదువుపట్ల శ్రద్ధ ఎక్కువ చూపడంవల్లో, సంప్రదాయ పద్ధతులపట్ల నిరాసక్తతవల్లో పెళ్ళిలో ఆమె స్తబ్దుగా ఉందనుకున్నాడు. తన ప్రేమతో, ఆరాధనతో

ఆమె మనసునూ, మమతనూ గెల్చుకొని, ఆనందంగా మన్మథ సామ్రాజ్యాన్నేలు కోవచ్చుననుకున్నాడు...బట్...!

తనకేం తక్కువ. రంగుమాత్రమే కాస్త నలుపు. అందరూ అందగాడ్నే అంటారు. అగ్రికల్చర్‌తో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాడు. ఈ సంగతి ప్రతిమ వాళ్ళకి తెలియకుండా తనేదాచేశాడు. ఏదో ఒక సందర్భంలో తెలుసుకొని, తన అర్ధాంగి ఆశ్చర్యపడితే చూడాలని.

కాకపోతే ఉద్యోగానికి తను వ్యతిరేకి. తన జ్ఞానాన్ని, శ్రమనూ గ్రామీణ జీవనాభివృద్ధికి ఉపయోగించాలనేది చిన్నప్పటినుండీ తనలో వేళ్ళూనుకున్న ఆశయం.

'ప్రతిమ తనను వ్యతిరేకించడానికి కారణం... ఆమె మనసులో... ఆల్‌రెడీ ఎవరైనా... ఉండి..' ఈ ఆలోచన అతడ్ని నిలువునా నీరసింపజేసింది. కవులు వర్ణించిన అందాలన్నీ కలబోసుకున్న ప్రతిమ నిజంగా అభినవ ప్రబంధనాయిక. ఆమె తన నాయిక కావడం అదృష్టంగా భావించాడు. కాని ఆ హృదయం తనది కాదని, కేవలం 'ప్రతిమ' మాత్రమే తనదన్న భావన ఇంతకింతకూ పెరిగి పెద్దదయి అతడిని మింగేయసాగింది. ధీరసమీరం కోసం ఎదురుచూసే వసంతుడు వడగాలిలో చిక్కుకున్నట్టు- విలవిల్లాడి పోసాగాడు. భవిష్యత్తు ముద్దగట్టిన ప్రశ్నార్థకం కాగా, తప్పనిసరై ఓ నిర్ణయానికొచ్చాడు. ప్రతిమవైపు చూశాడు.

మంచం మీద మెల్లగా కదులుతోంది - అటూ ఇటూ. నెమ్మదిగా మంచం వద్దకు చేరాడు. అనాచ్ఛాదితమైన ఆమె వక్షసంపద, అలంకార శోభితమయిన ఆమె వదన సౌందర్యం అతడిని ఆకట్టుకోలేకపోయాయి.

"ప్రతిమా!" ఆ పిలుపులో ప్రేమ లేదు. మార్దవముంది. అంతకుమించి జాలి ఉంది. ఓ స్నేహితుడి పరామర్శ ఉంది. గబుక్కున కళ్ళు తెరిచింది ప్రతిమ. చటుక్కున సర్దుకొని కూర్చుంది. జరిగిందేమిటో గుర్తుకుతెచ్చుకునే ప్రయత్నంలోనే ఉందామె.

"డోంట్ వర్రీ! నీకేమీ కాలేదు, కాదు. అంతా నువ్వనుకున్నట్టే జరుగుతుంది" క్షణమాగి మళ్ళీ అన్నాడు ప్రతీక్-"ఈ మూడురోజులూ ఎలాగోలా గడిపేయ్. తర్వాత నిన్ను మీ ఇంటికి పంపిస్తాను. భవిష్యత్తును గురించి తర్వాత ఆలోచిద్దాం" అతనలా గంభీరంగా చెబుతుంటే తెలీని భయమేదో ఆమెను కుదిపేయసాగింది.

* * *

"ప్రతీక్ నువ్వు తప్పు చేశావురా! ఆడది ఎంతసుకుమారి అయినా, పొగరు మోతైనా, రిజర్వ్‌డయినా, ఈగోతో పేట్రేగి పోతున్నా మగాడి స్పర్శ సోకేవరకేరా అదంతా. తరువాత నువ్వు కాదన్నా తను నీ వెన్నంటి ఉండేందుకే ఇష్టపడ్తుంది. ఎంతమందిని చూడటంలేదు? పైగా ఆమె నిన్ను వారించలేదు. వ్యతిరేకించలేదు.

"ఏదో తొలిరేయి కొందరమ్మాయిలలా బెదిరిపోవడం సహజమే. పైకిచూస్తే కఠినంగా కనిపిస్తావు. ఇంత సున్నితం ఏంట్రా నీమనసు? ఇప్పటికీ మించి పోయిందిలేదు. తొందరపడి అమ్మాయిని కాపురానికి తెచ్చుకో. లేకపోతే పరిస్థి తులు దారుణంగా మారతాయి."

ఏ పని చేస్తున్నా ప్రతీక్ చెవులలో స్నేహితుడు మదన్ చెప్పిన మాటలే మార్మోగుతున్నాయి. ఎప్పుడూ ఎంతో హుషారుగా పనిచేస్తూ శ్రమజీవనానందాన్ని అనుభవించే ప్రతీక్ పరధ్యానంతో, ఏదో పోగొట్టుకున్న వాడిలా వుండటం తల్లికీ, పనివాళ్ళకీ ఆశ్చర్యం కలిగించలేదు సరికదా. కొత్త పెళ్ళికొడుకు పెళ్లాం ఆకర్షణకు బాగా లోనైపోయాడన్న అపప్రథను మాత్రం తెచ్చిపెట్టింది.

వారం తిరక్కుండానే భార్యనొకసారి చూడాలని బలంగా అనిపించింది ప్రతీక్‌కి. 'ఆమె పట్ల ఇంకా మమకారం పెంచుకోవడమెందు'కంటున్న మనసు రొదని తట్టుకుంటూనే తల్లికి ఓ మాటన్నా చెప్పకుండా చూసిరావాలని హడావుడిగా బయల్దేరాడు ప్రతీక్.

* * *

వారం రోజులుగా విచిత్రమైన పరిస్థితులను ఎదుర్కొంటోంది ప్రతిమ. ఇద్దరు చెల్లెళ్ళూ, తల్లీదండ్రీ ఆమె అదృష్టానికి ఎంతగానో మురిసిపోతున్నారు.

పెద్ద చెల్లి ప్రణతి అయితే సిగ్గువిడిచి తన మొగుడి అందాన్ని పొగుడ్తూ, అసూయ ప్రకటిస్తూంటే ఇబ్బందిగా అనిపించిందామెకి. ఏ ఒక్కరికీ తన చదువూ, అభిప్రాయాలూ అసలు పట్టనేలేదు. వాళ్ళ ఆలోచనలన్నీ ఆడది పెళ్ళాడటానికే పుట్టిందన్నట్టున్నాయి. కాని, అదేక్షణంలో తనభర్త, మెట్టినిల్లూ తన అదృష్ట ఫలమేనేమోనన్న నమ్మకమూ మరోపక్క బలపడసాగాయి.

అది పల్లెటూరే అయినా, పట్నవాసం అద్దెకొంపలో తామనుభవించలేని సౌకర్యాలెన్నో అక్కడ వున్నాయి. అందంగా తీర్చిదిద్దిన విశాలమైన ఇల్లు.

అధునాతనంగా అలంకరించిన పై అంతస్తు తమకే ప్రత్యేకం. అందులో ఓ హాలు. వెన్నెల కిరణాలను జుర్రుకోగలిగే అందమైన టెర్రస్.

షెవర్, మిర్రర్‌లతో వాల్ టు వాల్ డెకరుషన్‌తో లేటెస్ట్‌గా పలకరించే స్నానాలగది. అన్నింటినీమించి, అద్భుతమైన పెయింటింగ్స్‌తో మత్తెక్కించే బెడ్‌రూం. తొలిరేయి అవన్నీ గమనించకున్నా తరువాత రెండ్రోజులూ పగలూ, రాత్రీ తరచితరచి చూసింది. ప్రతీక్ టేస్ట్, శ్రద్ధ, తన పట్లగల అభిమానం కొంచెం కొంచెంగా అర్థమయినాయి.

ఏదో లోటు ఆమె మనసులో. ఏవో అనుకోని అడ్డుతెరలు-అతని నల్లని రంగు, గుబురు మీసాలు...అన్నింటినీ మించి తన భర్త ఓ రైతు అనే భావన ఆమెను ఏ ఆనందానికీ చేరువగాకుండా అడ్డుకుంటున్నాయి.

మరోవంక స్త్రీ జీవితంలో ముఖ్యమయిన క్షణాలను కాలదన్నుకున్నానేమోనన్న అసంతృప్తి అప్పుడప్పుడూ ఆమెను తొలుస్తూ, భవిష్యత్తు గందరగోళం కానుందేమోనని అనిపించసాగింది.

"హలో మిసెస్ ప్రతీక్‌గారూ! ఎనిమిదిన్నరవుతోంది. కలలుగన్నది చాలు, లేవండి!" దుప్పటి లాగింది ప్రణతి.

"ఏయ్! నోర్మూసుకొని నీ పని జేసుకో! పో!" చెల్లెల్ని కసిరి మళ్ళీ ముసుగుదన్నింది ప్రతిమ.

"తంతే గారెల బుట్టలో పడ్డట్టు, ఏం సుఖపడుతున్నావే!" అంటూ కదిలింది ప్రణతి, నీళ్ళ బిందెతో.

"పింకీ! కొంచెం ఓపిక చేసుకొని లేమ్మా! గ్యాసయిపోయిది సడెన్‌గా. రాత్రి నీళ్ళు సరిపడా రాలేదు. దానికి కాలేజీ టైమవుతోంది. నేనూ, మీ నాన్నా బయటికెళ్తున్నాం. ఈ రోజుకు బైట్నుంచి నాలుగుబిందెలు నీళ్ళు తీసుకు రామ్మా!" అని బతిమాలింది తల్లి.

"ఆ! నేను లేకుంటే ఎలా చేసుకునేదో!" ముసుగు తీయకుండానే విసుక్కుంది ప్రతిమ.

"బాగుందేనీవరస. వెనకటికి నీలాంటిదే 'నేను పుట్టకపోతే ఎవర్ని చేసుకునేవారు?' అనడిగిందట మొగుడ్ని" నవ్వుతూ చురకేయడం శమంతకి వెన్నతో పెట్టిన విద్యే.

తల్లి మాటలతో ప్రతిమ నిద్ర తెమలిపోయింది. రాత్రి బాగా పొద్దుపోయేదాకా నిద్రపట్టడమేలేదు. ఎప్పుడైనా రెప్పలు మూతపడ్డా పిచ్చి - పిచ్చి కలల్తో అదీ

పాడవుతుంది. ఏమాత్రమైనా నిద్రపోగలిగితే అది తెల్లవారు ఝామునే. అదీ పాడైంది. తప్పదన్నట్టు లేచింది.

"నాకు కాస్తసాయం చెయ్యొచ్చుగా!" నీళ్ళ బిందె మోసుకొస్తూ బ్రష్ చేస్తున్న ప్రతిమపై అరచింది ప్రణతి.

"పల్లవేం చేస్తూందీ?" అడిగింది ప్రతిమ.

"అదా? ఆడుకుంటోంది వ్యంగ్యంగా అంది "నీ మొగుడు ఊరుకుంటా డేమోగానీ, దాని ప్రిన్సిపాల్ వీపు చీరేస్తుంది ఏ కాస్త ఆలస్యమైనా. టిఫిన్ కూడా చేయకుండా కాలేజ్‌కెళ్ళింది." ఆ అమ్మాయి ఇంటర్.

"ఏడవకు! వంట చేస్తాలే!" అంది ప్రతిమ.

"ఆ పని జేయి పుణ్యం వుంటుంది." అంటూ నీళ్ళకోసం పోబోయింది ప్రణతి.

అప్పుడుగానీ స్ఫురించలేదు ప్రతిమకి గ్యాస్ అయిపోయిన సంగతి. "అమ్మో! ఆ కిరోసిన్ స్టౌతో నేనేగలేను తల్లీ! నీళ్ళకే వెళ్తానిటియ్యి!" ప్రణతి చేతుల్లోంచి బిందెను లాక్కొంది. 'హుఁ! ఇరవైరెండు మెట్లు దిగీ, ఎక్కి వంద గజాలు నడిచి...' మనసులోనే తన దుస్థితిని తిట్టుకుంటూ మెట్లు దిగసాగింది, నోట్లో బ్రష్ ఆడిస్తూనే.

ఆంధ్రదేశంలోని నీటికరువంతా అక్కడే ఉందా అన్నట్లు జనం కిటకిటలా డుతున్నారు-పంపు వద్ద. 'మరో అరగంటకి గాని తనవంతు వచ్చేలాలేదు' అనుకుం టూ బిందెను అక్కడ పెట్టేసి, వెనక్కి తిరగబోయి, కాళ్ళకి బ్రేకులుపడ్డట్టు ఆగిపోయింది.

అపనమ్మకం! అయోమయం!! అంతలోనే కంగారు. క్షణం తరువాత తేరుకునేసరికే చేరుకున్నాడతడక్కడికి. తొలిసారిగా ఆమె బుగ్గలను సిగ్గులు పలకరించాయి. కాని, నోట్లో బ్రష్షు, నైటీలోని తన అవతారం గిల్టీగా ఫీలయ్యేలా చేశాయి ఆమెని. పరుగులాంటి నడకను అందుకుంది.

తొలిసారిగా భార్యలో తనపట్ల ప్రేమాదరాలని గమనించిన ప్రతీక్ మనస్సు సంతోష తరంగితమైంది. భార్య వెంటే వడివడిగా నడవసాగాడు. మరో పది అడుగులు వేస్తే ఇల్లుచేరేవారే. అంతలో-"ఢాం!" దిక్కులు పిక్కటిల్లేలా పెద్ద విస్ఫోటనం.

కెవ్వుమని అరచి భర్తనల్లుకుపోయింది ప్రతిమ. ప్రతీక్ కూడా ఒక్క క్షణం అప్రతిభుడయ్యాడు. హాహాకారాలు, అరుపులు, కేకలతో ఆ ప్రాంతమంతా

మార్మోగింది. చురుగ్గా చూశాడు ప్రతీక్. మంటలు వాళ్ళ ఇంటి నుండే. భార్యని కదిలించాడు. భయపడ్తూనే చూసింది ప్రతిమ. తమ ఇంటి చుట్టూ దట్టమైన నల్లని పొగ.

గ్రౌండ్ ఫ్లోర్‌లోపల నుండి మంటలు. ఫస్ట్‌ఫ్లోర్‌లో తన చెల్లి. "ప్రణతీ...! ప్రణతీ!" అరచింది ప్రతిమ. ఇంక ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ పొగలో నుండే మేడలోకి పరుగెత్తాడు ప్రతీక్. అంత భయం, కంగారులోనూ ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయాలనే ఆలోచన కలిగింది ప్రతిమకు.

* * *

అదృష్టవశాత్తూ ప్రణతి బ్రతికింది. కాదు ప్రతీక్ ఆమెను బ్రతికించాడు. ముఖం, ఎదభాగం కొంత కాలినా అవి పెద్దనష్టం కలిగించలేదు. ప్రతీక్‌కి కూడా గాయాలయ్యాయి. కాని, ఎంతో సాహసంతో ప్రణతితో పాటు ఇద్దరు చిన్నారులను కాపాడాడు అతను. వీధి వీధంతా అతనికి నీరాజనాలే. కొందరైతే భగవంతుడే అతని రూపంలో వచ్చాడని తెగ మెచ్చుకున్నారు.

ప్రతీక్ పదిరోజులు ఆస్పత్రిలో ఉండవల్సివచ్చింది. ఈ పదిరోజులూ ప్రతీక్‌ని కంటికి రెప్పలా, అపురూపంగా చూసుకుంది ప్రతిమ. జరిగిన సంఘటన ఆమెను ఎన్నో విధాలుగా ఆలోచింపజేసింది.

'ప్రణతి స్థానంలో తానే ఉండి వుంటే, తన అందం ఏమై ఉండేది? అందమంటే ఇంతేనా? ఆయన రంగునలుపేగాని, అంతరంగమెంత స్వచ్ఛం? ఆయన ఆ క్షణంలో సంపాదించిన కీర్తి, తను జీవితకాలమంతా కష్టపడ్డా సాధించగలదా?...' ఎన్నో ఆలోచనలు అతడ్ని ఉన్నతుడ్నీ ఆమెను అణువునూ చేస్తుంటే 'ఆయన సేవే తన అదృష్టం' అనుకునే స్థితికి వచ్చింది.

ఈ నేపథ్యంలో అతని ఆశయం, చదువూ, మంచితనమూ తన అత్తయ్య ద్వారా, అతని స్నేహితులద్వారా తెలిసి, మరింత ఆశ్చర్యానందాలనొందింది.

ఇప్పుడతని నలుపు రంగే కాదు, కాలిన గాయంతో ఏర్పడ్డ వికారమయిన మచ్చ కూడా ఆమెకు బ్యూటీస్పాట్‌లాగా ఎంతో అందంగా కనిపించ సాగాయి.

ప్రతిమ పరిచర్యలకు ఆశ్చర్యం, ఆనందం కలుగుతున్నా ఇంత మంచి మనసున్న సౌందర్యరాశి తనకు దక్కకుండాపోతుందేమోనన్న బాధ, అంతలో నే 'ఆమెకిష్టమైన చోటికి ఆమెను చేర్చడమే తనకానందం' అని అనుకోసాగాడు ప్రతీక్.

"ప్రతిమా! నీ మనసులో ఉన్నది ఎవరో ఇప్పటికైనా చెబుతావా?" మరుసటి రోజు డిశ్చార్జ్ చేస్తారనగా అడిగాడు - ప్రతీక్ ఏకాంతంగా వున్న సమయంలో.

కొద్దిసేపు మౌనం. తర్వాత అటూ-ఇటూ పరికించి చూసింది. చటుక్కున ప్రతీక్ బుగ్గన గట్టిగా ముద్దెటుకొని, చెవి దగ్గర గుసగుసగా అంది... "ఆగిపోయిన మన శోభనమెప్పుడో చెప్పండి" ఆపై సిగ్గుతో బుగ్గలెరుపెక్కగా, నవ్వు బిగబట్టి, ఏమీ ఎరగనట్టు పక్కకు చూడసాగింది.

ఒక్కక్షణం బిత్తరపోయి, ఆపై తేరుకొని ఆమె రెండుచేతులూ పట్టుకొని 'ప్రతిమా!' అన్నాడు ప్రతీక్ నమ్మలేనట్టు.

'ఎస్! ఐ మీన్, వాటయ్ సే!' అన్నట్టు కనురెప్పలని గట్టిగా మూసి తెరిచింది. ఆపై, చాచిన అతని బాహువుల్లో గువ్వపిట్టలా ఒదిగిపోయింది ప్రతిమ.

"ప్రతిమా! అయ్ లవ్ యూ!" అని ఆమెను గట్టిగా హత్తుకున్నాడు.

"అయ్...లవ్...యూ...టూ...మచ్!" అతడిని మరింతగా అల్లుకుందామె. శృంగారానికి పరస్పరాభిమానమే 'తొలిమెట్టు' అని అనుభవంద్వారా తెలుసుకున్న ఆదంపతులు ఆమధుర క్షణాలకై ఆ క్షణం నుంచే నిరీక్షించసాగారు.

**(30-01-2003 స్వాతి సచిత్ర వారపత్రిక)**